కథ

# సహాయం

కె.కె.భాగ్యశ్రీ

టక్.. టక్... టక్....

స్నేహితురాలితో ఫోన్‌లో మాట్లాడుతున్న కావేరి, తలుపు చప్పుడు విని ఫోన్ కట్ చేసి లేచి వెళ్లి తలుపు తీసింది.


బయట ఓ అరవై ఏళ్ల ముసలాయన నిలబడి వున్నాడు.

నీరు కావి రంగుపంచె. శ్రమాధిక్యత వలన వదలిపోయిన శరీరం, అనుభవాల ఆయుష్షు చాటుతోన్నట్లుగా ముడతలు పడిన నుదురు... వెరసి తన అసలు వయసు కన్నా మరికాస్త ఎక్కువ వున్నట్లుగా కనిపిస్తున్నాడు ఆయన.

''ఎవరు కావాలండీ..'' సౌమ్యంగా అడిగింది కావేరి.

''మీ ఎదురు ఫ్లాట్‌లో వుండే రామారావు గారు వాళ్లూ...'' అర్థోక్తిలో ఆగిపోయాడాయన.

ఎదురు ఫ్లాట్‌కి తాళం వేసుందని గమనించిన కావేరి ''ఆయన ఆఫీసుకి, పిల్లలు స్కూలుకి వెళ్లుంటారు. మరి.... ఆవిడ ఎక్కడికెళ్లారో నాకు తెలీదు. ఇంతకీ...మీరు...'' సందేహంగా అడిగింది కావేరి.



''రామారావు మా అబ్బాయమ్మా...'' అన్నాడు నుదుట పట్టిన చెమటను పైపంచతో తుడుకుంటూ...

''ఆహాఁ... అలాగా... బయటే నిలబడి వున్నారు లోపలకి రండి...'' పక్కకి తొలుగుతూ ఆయన్ని ఆహ్వానించింది కావేరి మర్యాద పూర్వకంగా.

''ఫర్వాలేదమ్మా...'' అన్నాడాయన బిడియ పడుతూ...

''బాగా అలసి పోయినట్లున్నారు.... ఆవిడ వచ్చేవరకూ మా ఇంట్లో కూర్చోండి'' పిలిచింది కావేరి.

మరి రెట్టించక లోపలకి వచ్చాడాయన. తనతో పాటు తెచ్చిన సంచుల్ని, అరటిగెలని కూడా తీసుకొచ్చి తలుపు వారగా పెట్టాడు.

ఫ్యాన్ ఫుల్‌స్పీడ్ పెట్టి, చల్లని మంచినీళ్లు తెచ్చి అతడికిచ్చింది కావేరి.

ఎదురు ఫ్లాట్‌లోకి రామారావుగారు వచ్చి నాలుగు నెలలే అయ్యింది. ఆయన భార్య కాంచనకు ఆఫీసర్ భార్యనని అహంకారం జాస్తి అని, తన తాహతుకి ఎవరూ తులతూగరన్న తలబిరుసుతో ఎవ్వరితోనూ కలవదనీ ఫ్లాట్స్‌లో మిగిలిన ఆడవాళ్లు చెవులు కొరుక్కోవడం రెండు మూడు సార్లు విని వుంది కావేరి.

ఆమెకు ఇరుగు – పొరుగుల్తో అధిక ప్రసంగాలు చేయడం ఇష్టం వుండదు. తనకు చేతనైతే ఎదుటి వారికి సహాయపడడం, తన వల్ల కాదనకుంటే మిన్నకుండడం మినహా అనవసర విషయాల్లో తల దూర్చదు కావేరి.

అందుకే..కాంచనతో అంతగా పరిచయం ఏర్పడలేదు.

''మీరు వస్తున్నట్లుగా వాళ్లకి తెలియదా బాబాయ్ గారూ'' అడిగింది కావేరి వరస కలుపుతూ..

''తెలిసే వుండాలనుకుంటున్నానమ్మా... వస్తున్నట్లు రెండు ఉత్తరాలు కూడా రాశాను చెప్పాడాయన.

''ఏదో అర్జంటు పనిమీద వెళ్లుంటారు బాబాయ్ గారూ...మీరేమీ అనుకోనంటే.. మా ఇంట్లో భోజనం చేయండి...'' అంది కావేరి.

ఆయన విపరీతంగా మొహమాటపడుతూ ''అయ్యో... నీకెందుకమ్మా శ్రమ... మాకోడలు వచ్చేస్తుంది లే..'' అన్నాడు.

''ఎప్పుడు బయలుదేరారో ఏమో! నా మాట విని కాస్త ఎంగిలి పడండి....'' బలవంతం చేసింది కావేరి.

ఏమనుకున్నాడో ఏమో...కాళ్లూ, చేతులు కడుక్కొని ఆమె వడ్డించిన భోజనాన్ని కడుపునిండా తిన్నాడు ఆయన.

''అన్నదాతా సుఖీభవ... మంచి భోజనం పెట్టావమ్మా... వెయ్యేళ్లు చల్లగా వర్ధిల్లు..'' తృప్తిగా తేన్చి దీవించాడు ఆయన చేతులు తుడుచుకుంటూ...

ఆ పొగడ్తలని ఆశించని దానిలా ''ఇదేమంత ఘనకార్యమని అలా పొగుడుతున్నారు బాబాయ్ గారూ..'' అంది కావేరి ఎంతో వినయంగా.

''నీకు తెలియదమ్మా.. ఎంత డబ్బు సంపాదించినా సరే.. ప్రాప్తం లేకపోతే ఒక్కో రోజు ఆకలి వేళకి అన్నం పుట్టదు. ప్రతి బియ్యపు గింజ మీదా తినేవాడి పేరు రాసి వుంటుందంటారు. సాధారణంగా ఎవరు భోజనం పెడతామన్నా కాదని అనను. ఒక వేళ కాదంటే ఆరోజుకి తిండియోగం వుండదు. ఇది నా స్వానుభవంలో నేను గ్రహించిన విషయం. ఏ జన్మ ఋణమో.... ఆప్యాయంగా అన్నం పెట్టావు....'' కళ్లు చెమర్చాయి ఆయనకి.

చలించిపోయింది కావేరి.

''పిల్లలెందరు తల్లీ..?'' అడిగాడాయన.

చెప్పింది కావేరి. ఆమెను చాకు అడిగి తీసుకొని అరటిగెలలోంచి రెండు పెడలు కోసి ఆమె చేతిలో వుంచి ''మా దొడ్లో పండిన పళ్లమ్మా..అమృతపాణి...పిల్లలకియ్యి..'' అన్నాడు ఆయన.

''అబ్బే...వద్దు...'' అంది కావేరి కంగారుగా.

కావేరి అంతరంగం అవగతమైన వాడిలా చిరునవ్వు నవ్వి ''నువ్వు పెట్టిన అన్నానికి వెల కట్టడం లేదమ్మా. నిన్ను నా కూతురిలా భావించి ఇస్తున్నాను. కాదనకు..'' అన్నాడాయన.

మాట్లాడకుండా వాటిని అందుకుంది కావేరి.

మాటల మధ్య తాను పల్లెటూర్లోనే వుండి వ్యవసాయం చేస్తున్నాననీ, పిల్లలకి ఫీజులు కట్టాలి డబ్బులు అవసరం అని కోడలు కబురు చేస్తే పంట నమ్మి ఆ డబ్బు తెచ్చాననీ...'' ఇంకా ఏవేవో చెప్పాడు ఆయన.

అన్నింటికి 'ఊ' కొట్టింది కావేరి.

ఇంతలో కాంచన వచ్చింది. షాపింగ్ చేసిన వస్తువులను బ్యాగులలో మోసుకొని గుమ్మానికి ఎదురుగుండా కూర్చున్న మామగారిని చూస్తునే ఒక్కసారి ఆశ్చర్యపోయి, అంతలోనే ముఖం ముడుచుకొని ''మీరా! ఎప్పుడొచ్చారు?'' అని ప్రశ్నిస్తూనే తలుపు తీసుకొని లోపలకి వెళ్లిపోయింది.

కోడల్ని చూస్తూనే నింపాదిగా కూర్చున్న వాడల్లా హడావుడి పడుతూ ''మా కోడలు వచ్చేసిందమ్మా..నేను వెళ్లొస్తాను. నీ ఆదరణ జీవితంలో మరువలేను...'' అని చెప్పి సంచులు తీసుకొని కాంచన వెంటే వెళ్లిపోయాడాయన.

ఆయన వెళ్లిపోయిన అయిదు నిమిషాల తరువాత తలుపు వెనక వున్న అరటిగెల మీద పడింది కావేరి దృష్టి.

''అరెరె.... గెల ఇక్కడే మరిచిపోయారు.'' అనుకుంటూ దాన్ని తీసుకొని ఎదుటి ఫ్లాట్ దగ్గరకు వెళ్లింది.

దగ్గరగా వేసి వున్న తలుపు నెట్టబోయి ఆగిపోయింది.

''మీరు వస్తున్నట్లుగా మాకో కబురు చేయవచ్చుగా. ఉరుములేని పిడుగల్లే హటాత్తుగా ఊడిపడితే మాకెలా తెలుస్తుంది. నాకు సవాలక్ష పనులు. బయటకెళ్లకపోతే కుదరదు.'' కాంచన మాటలు కటువుగా వినిపించాయి.

''రెండు ఉత్తరాలు రాశానమ్మా....'' చెప్తున్నాడా ముసలాయన నెమ్మదిగా.

''ఏమో... అవి మా కంది చావలేదు. అయినా



ఎదురు ఫ్లాట్‌లోకి రామారావుగారు వచ్చి నాలుగు నెలలే అయ్యింది. ఆయన భార్య కాంచనకు ఆఫీసర్ భార్యనని అహంకారం జాస్తి అని, తన తాహతుకి ఎవరూ తులతూగరన్న తలబిరుసుతో ఎవ్వరితోనూ కలవదనీ ఫ్లాట్స్‌లో మిగిలిన ఆడవాళ్లు చెవులు కొరుక్కోవడం రెండు మూడు సార్లు విని వుంది కావేరి.

ఫోన్ నెంబరొకటి ఇచ్చేడిశాంగా... ఫోన్ అయినా చేసి రావొచ్చు కదా!'' నిందావాక్యాలతో మామ గారిని నిలదీస్తోంది కాంచన.

''ఊళ్లో ఉన్న ఫోన్లన్నీ డెడ్ అయ్యాయమ్మా.'' మెల్లని స్వరంతో సంజాయిసీ చెప్తున్నాడాయన.

''సాకులు బాగానే చెప్తున్నారు...సర్సరే..భోజనానికి రండి... మధ్యాహ్నం తిండి తిన్నాక కాస్సేపు కునుకు తీస్తే గాని నా ఒళ్లోప్పదు...'' తొందర చేస్తోంది. కాంచన.

''నా భోజనం అయిపోయిందమ్మా...''

''ఎక్కడా?'' గట్టిగా అరిచింది కాంచన.

తృళ్లిపడింది కావేరి.

ఎదురుగుండా ఫ్లాట్‌లో అమ్మాయి బలవంత పెడితే కాదనలేకా....'' గునిశాడు ఆయన.

''ఏంటి?.. ముక్కు మొహం తెలియని ఆవిడెవరో అన్నం పెడితే తిన్నారా? అక్కడికి కొడుకు, కోడలు తిండి కూడా పెట్టకుండా తిప్పి పంపారన్న అపవాదు మా నెత్తిన పడాలనా..కాస్సేపాగి తింటే... కొంప మునిగిపోతుందా! అంతలో కక్కుర్తి పడి అక్కడ మింగేయాలా? అయినా ఆవిడికేమంత అక్కడకి... తనేదో త్యాగశీలి... ఎదుటివారు కాదన్నట్లుగా బిల్డప్ ఇవ్వడం కాకపోతే నలుగురికీ సాయపడుతోందని పదిమందీ మెచ్చుకోవాలన్న దుగ్ధతో ఇలాంటి పనులు చేస్తోంది కాబోలు..'' పరుషంగా పరిసరాలు ప్రతిధ్వనిస్తున్న ఆమె మాటల ప్రవాహం అలా సాగిపోతూనే వుంది.

నిశ్చేష్ట అయ్యింది కావేరి. ఎండనపడి సరుకులన్నీ మోసుకొచ్చిన మామగారి మీద కాస్తన్నా సానుభూతి లేకండా కేకలేస్తున్నదే కాక... సదుద్దేశ్యంతో తాను చేసిన అతి చిన్న సహాయాన్ని తప్పుపట్టి, పెడర్థాలు తీస్తున్న ఆవిడ సంస్కారం ఏపాటిదో అర్థమైంది కావేరికి...

తలుపు తట్టింది నెమ్మదిగా...

''ఎవరూ!'' కసిరినట్లుగా అంటూ తలుపు తీసింది కాంచన.

''మీ మామగారు మా ఇంట్లో మరిచిపోయారు.'' అరటి గెలను వాళ్లింట్లో గడపలో పెట్టేసి మరోమాటకి ఆస్కారం ఇవ్వక గిరుక్కున వెనుదిరిగి తన ఫ్లాట్‌లోకి వచ్చేసింది కావేరి.

ఆ ముసలాయన ముఖంలోకి చూసే ధైర్యం ఆమెకి లేకపోయింది. దైన్యం వెదజల్లే ఆ దృక్కులు తనని కలవర పెడతాయని ఆమెకు తెలుసు.

తరువాత భర్త మోహన్ ముందు తన మదిలోని ఆవేదనను వ్యక్త పరిచింది.

అంతా విన్న మోహన్ ''తప్పునీదే కావేరీ... ఆవిడ మనస్తత్వం ఎటువంటిదో తెలిసి కూడా ఆయనకి భోజనం పెట్టావు దేనికి?'' అన్నాడు.

''ఎండనపడి వచ్చిన ఆయనను చూసి జాలి కలిగి... పిడికెడు అన్నం పెట్టడం కూడా తప్పేనా'' కళ్లంట నీళ్లు తిరిగాయి కావేరికి.

''భోజనం పెట్టడం తప్పు కాదు. కాని దాని వలన మనం నిష్ఠూరాలు మోయాల్సి వుంటుందని ఊహించకపోవడం తప్పు. అయినా అపరిచితుల్ని ఇంట్లోకి రానిచ్చేముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. ఆయన నిజంగానే రామారావు గారి తండ్రి కాబట్టి సరిపోయింది. ఎవరో మోసగాడ్డై వుంటే ఏం జరిగేది?'' మెత్తగా మందలించాడు మోహన్.

భర్త మాటల్లో వాస్తవం గుర్తించిన దానిలా మౌనం వహించింది కావేరి. కాని చిన్నతనం నుంచీ తండ్రి నూరిపోసిన నీతులన్నీ చెవుల్లో రొదగా వినిపిసస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.

''చూడమ్మా కావేరీ....మనిషికి తప్పనిసరిగా ఉండి తీరవలసిన మంచి లక్షణాల్లో ఎదుటి వ్యక్తికి సహాయపడాలన్న తపన కలిగి వుండడం ఒకటి... ఆపదలో వున్న వారిని ఆదుకోవడం మానవత్వం.. నీకు చేతనైనంతలో సాటి మనిషికి సాయపడు...'' దైవసమానుడైన తండ్రి చెప్పిన సూక్తులను ఈ చెవితో విని, ఆ చెవితో వదిలివేయలేకపోయింది కావేరి. తనకున్న వనరులతో, తన చుట్టూ వున్నవారికి సహాయపడాలన్న దృఢనిశ్చయం ఆమెలో నెలకొంది.

మోహన్ కూడా అర్ధాంగి సంకల్పానికి తన వంతు చేయూతనందించే సహృదయుడు. అందుచేతనే కావేరి తననుకున్నది నిరభ్యంతరంగా చేయగలుగుతోంది. ఇవాళ తొలిసారిగా... తను చేసిన పని వలన ఎదుటి వ్యక్తితో మాటలు పడాల్సి రావడంతో ఆమె మనసు కష్టపడింది.

ఎదుటి వారికి సహాయం చేయడం కూడా తప్పు పనేనా? ఆమె మనసుని దొలుస్తూనే వుందీ ప్రశ్న.

★★★

కావేరి మనసు మనసులో లేదు. మబ్బు పట్టిన ఆకాశంలా భారంగా వున్న మదిలో వేనవేల ఆలోచనలు కల్లోల్లాన్ని సృష్టిస్తున్నాయి. ఆమె ఆవేదనకు కారణం ఆరోజు ఉదయం జరిగిన సంఘటన...

రైతుబజార్లో ఉల్లిపాయలు చవగ్గా దొరుకుతున్నాయంటే, పనులైపోగానే బయలుదేరి వెళ్లింది. కావేరి నాలుగు రోజుల క్రితం. ఇంటిల్లపాదికీ ఉల్లి లేనిదే ముద్ద దిగదు. అందుకే కిలో ముప్పై, నలభై రూపాయలైనా, కొనవలసి వస్తోంది. రైతుబజార్‌కి వెళ్లిన కావేరి అక్కడి ఉల్లిపాయల అంగడి దగ్గరున్న కొండవీటి చాంతాడంత క్యూని చూసి హడలిపోయింది.

అయినా తప్పదు... నాలుగు పైసలు ఆదా చేయాలని చూసే మధ్య తరగతి మహిళ మనస్తత్వం కావేరిలోనూ వుంది. అందుకే ఓపిక లేకపోయినా నిలబడింది. పైన భానుడు తన ప్రతాపాన్ని చూపనారంభించాడు. అరగంట గడిచాక యధాలాపంగా వెనక్కు తిరిగిన ఆమెకు, అంతకు అంత పెరిగిన క్యూలో ఆఖరున నిలబడిన పక్కవీధి పార్వతమ్మ కనిపించింది.

గయ్యాళి గంగమ్మ లాంటి కోడలు పెట్టే ఈతి బాధలు తట్టుకుంటూ, ఆ వయసులో ఇంటెడు చాకిరీ చేసే పార్వతమ్మంటే ఆమెకు చెప్పలేనంత సానుభూతి.

ఎండలో చెమటలు కక్కుతూ నిలబడిన ఆమెను చూస్తే గుండె కరిగినీరైంది కావేరికి. కృష్ణా, రామా అంటూ కూర్చోవలసిన ఈ వయసులో ఆమెకిదేం యాతన?! క్యూ ఎరమింగిన కొండ చిలువలా అతి భారంగా కదులుతోంది. తన జాగా చూస్తూ వుండమని తన వెనకున్నావిడకి చెప్పి ఆవిడ దగ్గరగా వెళ్లింది కావేరి.

''పిన్నిగారూ... ఎండ ఇంతలా మండిపోతోంది. ఈ ఎండన పడి మీరు రాకపోతేనేం చెప్పండి?'' అంది కావేరి సానుభూతిగా.

ధారాపాతంగా కారుతున్న చెమటలను తుడుచుకుంటూ ఆవిడ నవ్వింది వేదాంతిలా. ఆ నవ్వులో మర్మం అర్థమైంది కావేరికి.

''మీ సంచి, డబ్బులు నా కిచ్చేసి మీరు కూర్చోండి. నేను తీసుకొస్తాను'' అంది బరువెక్కిన గుండెతో.

''నీకెందుకు శ్రమ?'' అంది పార్వతమ్మ అభిమానంగా.

''భలేవారే పిన్నిగారూ... ఇందులో నాకు శ్రమేముంది? నేనెలాగూ క్యూలోనే వున్నాను కదా...'' చొరవగా ఆవిడ చేతిలోని సంచి అందుకుంది.

ఇద్దరికీ కావలసిన ఉల్లిపాయలు తీసుకొన్నాక రిక్షాలో ఆవిడను వాళ్లింటి దగ్గర దింపితే గాని తృప్తి కలగలేదు కావేరికి.

అయితే... ఆమె చేసిన ఈ ఉపకారానికి ప్రతిఫలంగా మరిన్ని తిట్లూ, చీవాట్లు లభిస్తాయని ఆమె ఊహించలేదు.

ఇవాళ ఉదయం పిండి మిల్లు దగ్గర కనిపించిన పార్వతమ్మతో ''పిన్నిగారూ... మీవీ, నావీ కూడా పట్టించుకొని తీసుకువచ్చేస్తాను. మీరు పదండి...'' అంది కావేరి.

''వద్దమ్మా... పెద్దమనసుతో నువ్వు చేసే సహాయాన్ని పొందే అదృష్టం నాకు లేదు.'' అంది పార్వతమ్మ నిర్లిప్తంగా.

ఏదో తెలియని ఒక బాధా తరంగం ఆమె వదనంలో కదలాడింది.

''అదేంటి పిన్నిగారూ... అలా అంటారు?'' తెల్లబోయింది కావేరి.

''మరేం చేయనమ్మా...మొన్న రైతు బజార్లో ఉల్లిపాయలు కొనిచ్చి, ఇంటిదాకా రిక్షాలో దిగబెట్టావని మా కోడలు వీరంగం వేసి నానా మాటలు అంది. ఇంటి గుట్టు రచ్చకీడుస్తున్నానని నన్నూ, అతి వినయం ప్రదర్శిస్తూ అందరినీ బుట్టలో వేసుకుంటున్నావనీ నిన్నూ నోటికొచ్చినట్లు కూసింది.'' చెప్పింది పార్వతమ్మ రుద్ధమైన స్వరంతో.

ఏదో పెద్దవారు కదాని, నాకు తోచిన సాయం చేసాను. ఆ మాత్రం దానికే అంత అల్లరా?'' అపనమ్మకంగానూ, ఆశ్చర్యంగానను అడిగింది కావేరి.

''ఏం చేస్తాం చెప్పు. దాని నైజమే అంత. నువ్వు చేసిన సహాయం వలన నేను కాస్త సుఖపడుతున్నాను కదా.... అది భరించలేక నిన్ను తూలనాడుతోంది.'' చెప్పింది పార్వతమ్మ బాధగా.

చేష్టలుడిగి నిలబడిపోయింది కావేరి. ఆమె హృదయం మరొకమారు గాయపడింది.

తల్లిలాంటి ముసలామెకు సహాయపడినందుకు

ఇన్ని నిష్ఠూరాలా? అసలు మనుషులేరకంగా కూడా ఆలోచిస్తారా? ఎంత స్వార్థం?

అంతరంగంలో ఆవేదన సుళ్లు తిరుగుతోంది.

''ఏంటీ కావేరీ ఏదో ఆలోచిస్తున్నట్లున్నావు?'' అడిగాడు మోహన్ భార్య పక్కనే కూర్చుంటూ.

కావేరి కలచిన హృదయంతో, తన వ్యథంతా బయల్పరిచింది.

''ఇదేం చోద్యమండీ... పక్కవ్యక్తి ఏమై పోయినా పట్టించుకోని వారిని కర్కోటకులని, రాతిగుండె మనుషులని నిందించే ఈ ప్రజలు సహాయం చేయాలని తపించే నాలాంటి వారిని కూడా తప్పు పడతారేం?'' అంది ఆవేశంగా.

మోహన్ ఆమెని స్వాంతన పరిచే ప్రయత్నం చేస్తూ ''కూల్ డౌన్ కావేరీ...కూల్‌డౌన్....సాటి వారికి సహాయ పడాలనే నీ ఉద్దేశ్యం మంచిదే. కాని మనం చేసే సహాయం అందుకునే ప్రాప్తం అవతల వారికి కూడా వుండాలి కదా?''అన్నాడు.

''సహాయం పొందడానికి కూడా అర్హత కావాలా? ఏమనిషి కన్నా అసహాయతకు మించిన అర్హత ఏముంటుంది? వారాలు చేసుకుంటూ చదువుకునే అప్పాజీకి అన్నం పెట్టడం ద్వారా అతడి ముఖంలో వెలుగు చూస్తున్నాను. కళ్లు సరిగ్గా కనపడని కాంతమ్మత్తయ్యకి బ్యాంక్ పనులు అవీ చక్కపెట్టి ఆవిడ మెప్పు, మన్నన పొందుతున్నాను.''

కానీ ఆ కాంచన, పార్వతమ్మగారి కోడలు వీళ్లు విపరీతార్థాలు తీస్తున్నారు. నన్ను మెచ్చి మేకతోలు కప్పకపోయినా ఫర్వాలేదు. ఒకరి పొగడ్తలను, మెప్పుకోళ్లను ఆశించి చేసింది సహాయం అనిపించుకోదు. కాని వీరు ఇలా తూలనాడితే మాత్రం చాలా కష్టంగా అనిపిస్తోంది. గొంతులో వేదన నిండింది కావేరికి.

''పిచ్చి కావేరీ... అప్పాజీకి, కాంతమ్మత్తయ్యకి నిజంగానే నీ సహాయం అవసరం. అందుకే వాళ్లు మనస్ఫూర్తిగా సంతోషిస్తున్నారు. కాని వీళ్ల సంగతి అలాకాదు. ఇంట్లోని పెద్దలను వట్టిపోయిన పశువులుగా, గుదిబండల్లా భావించి వారి చేత చాకిరీ చేయించుకునే దౌర్భాగ్యులు...అలాంటి వాళ్లు నీ సహాయాన్ని తప్పుగా భావించి పెడర్థాలు తీయకుండా వుండగలరా చెప్పు?'' భార్య తలనిమురుతూ లాలనగా అన్నాడు మోహన్.

భర్త ఇందాక ప్రస్తావించిన అర్హత ఏంటో అప్పుడర్థమైంది కావేరికి. ''అయితే....అలా వారు బాధపడుతుంటే చూస్తూ ఊరుకోవలసిందేనా?'' దీనంగా అడిగింది కావేరి.

''మన సహాయం ఎదుటి వ్యక్తికి ఏ రకంగానూ శాంతి నివ్వడం లేదని తెలిశాక, దానిని చేయకపోవడమే మేలు..'' హితవు పలికాడు మోహన్.

కావేరి మాత్రం తన హృదయాన్ని అంత త్వరగా సమాధాన పరుచుకోలేకపోతోంది. తండ్రి తనకు పదేశించిన నీతులన్నీ ఆచరణీయాలు కావా!? పదే పదే ఈ ప్రశ్న మదిలో గుచ్చుకొంటోంది.

ఏం చేస్తుంది? సహాయం చేయాలని తాపత్రయ పడడం తనకో వ్యసనం. అయితే... అది పది మంది మెప్పుపొందాలనో...లేక కావేరి మంచిది అని సర్టిఫికెట్ పొందడానికో కాదు. తండ్రి చెప్పిన మంచి మాటలను కొంతవరకైనా ఆచరిస్తున్నానన్న మానసిక తృప్తికోసం.

చూడబోతే అదీ...నేరంలాగే వుంది.... ఏంచేయాలి?

తనకు అంత మెత్తని మనసిచ్చిన దేముడి మీదా, దాని నిండా పరోపకార బుద్ధి నింపిన తండ్రి మీదా కోపం కలిగిందామెకి తొలిసారిగా.... ఆ రాత్రంతా ఆమెకి నిద్రలేదు.

★★★

మరొక పదిరోజుల తరువాత ఏదో పని మీద బయటకెళ్లి తిరిగొస్తున్న కావేరికి... నిప్పుల కురిసే ఎండలో, బియ్యం కోసం రేషన్ షాపు దగ్గర పడిగాపులు పడుతున్న పంకజాక్షి కనిపించింది.

ఆమె వెనక వీధిలో వుండే వెంకన్న చెల్లెలు. వెంకన్న ఏదో హాస్పటల్‌లో పనిచేస్తున్నాడు. పంకజాక్షికి హార్ట్ ప్రాబ్లం వుండడం వలన పెళ్లి కాలేదు. అన్నగారి ఆసరాతో బ్రతుకు బండి నీడుస్తున్న ఆమెకు వదినగారి చీవాట్లు, ఛీత్కారాలు అందుకోక తప్పడం లేదు.

అంత ఎండలో, దాదాపు కిలోమీటర్ దూరం నడుచుకొచ్చి రేషన్ కోసం క్యూలో నిలబడిన ఆమెను చూడగానే సహజ నైజం తలెత్తింది కావేరిలో.

'హార్ట్ పేషెంట్' అని కూడా చూడకుండా ఆడపడచుని ఇన్ని ఇక్కట్లకు గురి చేస్తున్న ఆమె వదినెపై పీకల్దాకా కోపమొచ్చింది కూడా.

వెంటనే ఆమె దగ్గరకి వెళ్లి 'నువ్వలా స్టూల్ మీద కూర్చో పంకజం.. నేను క్యూలో నిలబడతాను...'' అంది మృదువుగా.

''వద్దు కావేరక్కా.....వదినె సంగతి నీకు తెలియనిది కాదు. నాతో పాటు అనవసరంగా నువ్వూ చీవాట్లు తినాలి...'' అంది పంకజాక్షి బెరుగ్గా.

ఆమె కళ్లల్లో బెదురు స్పష్టంగా కనిపించింది.

కావేరి చిన్నగా నవ్వుతూ... ''ఆ భయం నీకవసరం లేదు..... మీ వదినె నా జోలికి రాకుండా నేను జాగ్రత్త పడతాను.'' అంది.

''ఎలా?'' అడిగింది పంకజాక్షి సందేహంగా.

''ప్రస్తుతానికి అది సస్పెన్స్..'' నవ్వింది కావేరి మళ్లీ.

వింతగా చూస్తున్న పంకజాక్షిని స్టూల్ మీద కూర్చోబెట్టి, తను క్యూలో నిలబడి రేషన్ తీసుకుంది.

ఆటో మాట్లాడుకొని ఎక్కి కూర్చున్నాక చెప్పింది కావేరి. ''ఈ పని నువ్వే సాధించుకొచ్చావని చెప్పు. అలా అయితే మీ వదినెగారి ఈగో శాటిస్ఫై అవుతుంది. మాట వరుసకైనా నా పేరు ఎత్తకు.''

అలాగేనని తలూపింది పంకజాక్షి.

వాళ్లుండే వీధి సమీపించగానే ఆటో ఆపు చేయించి ''ఊఁ...దిగు'' అంది కావేరి.

పంకజాక్షి ప్రశ్నార్థకంగా చూసింది.

ఇక్కడ దిగిపోయి, ఈ నాలుగు అడుగులు ఈ మూట మోసుకుంటూ వెళ్లావనుకో మీ వదినెకి ఎవరి మీద ఏ అనుమానం కలగదు.'' అంది కావేరి.

విచిత్రంగా చూసింది పంకజాక్షి. ఆమె సందేహం పసిగట్టినదానిలా చిరునవ్వు నవ్వింది కావేరి.

''ఈపాటి దానికి అంత బిల్డప్ దేనికని ఆలోచిస్తున్నావు కదూ! 'గుండె జబ్బు'తో బాధపడుతున్న నీకు ఈ చిన్న ఉపకారం చేయడం నా మనసుని తృప్తి పరచడం కోసం. నిన్ను ఇంటి దాకా వచ్చి దిగబెట్టకుండా, వీధి మొదట్లోనే దింపేయడం ఇద్దరి 'సేఫ్టీ కోసం.... అర్థమైందా?'' నవ్వుతూనే విడమరిచి చెప్పింది కావేరి.

తనూ నవ్వింది పంకజాక్షి ఆటో దిగుతూ...

ఆమె దిగిపోగానే ఆటో స్టార్టయ్యింది తిరిగి. ఇప్పుడు కావేరి మనసు ఎంతో తేలిగ్గా, ప్రశాంతంగా వుంది.

★

